www.vishalabharati.com
epaper.vishalabharati.com

మంగళవారం, హైదరాబాద్
07 అక్టోబర్ 2025
సంపుటి:3 సంచిక: 279


# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## నవంబర్ 11 జూబ్లీహిల్స్ పోలింగ్

02



# రాయదుర్గం @ఎకరం రూ.177 కోట్లు

## హైదరాబాద్‌లో భూమి వేలం రికార్డు సృష్టించింది

- రాయదుర్గం నాలెడ్జ్ సిటీ
- ఎకరానికి రూ.177 కోట్లు పలికింది
- ఏడు ఎకరాల 67 సెంట్ల భూమి
- రూ.1,357 కోట్లకు ఈ భూమి సొంతం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్‌లోని రాయదుర్గం ప్రాంతంలో భూమి వేలం రికార్డు సృష్టించింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఎకరానికి రూ.177 కోట్లు చొప్పున భూమి పలికింది. టీజీఐఐసీ నిర్వహించిన ఈ వేలంలో, మొత్తంగా ఏడు ఎకరాల 67 సెంట్ల భూమిని ఎంఎస్ఎన్ రియాలిటీస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చేజిక్కించుకుంది. ఈ సంస్థ మొత్తం రూ.1,357 కోట్లకు ఈ భూమి సొంతం చేసుకుంది. టీజీఐఐసీ అధికారుల ప్రకారం, ఈ వేలం రూ.1,357 కోట్లతో పూర్తి అయింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీ, హైదరాబాద్ షెడ్యూల్డ్ ఏరియాలో భాగంగా ఉన్న ఈ ప్రాంతం, ఐటీ, ఫార్మా, బయోటెక్ వంటి కంపెనీల కార్యాలయాలకు అనుకూలంగా ఉంది. గతంలో రాయదుర్గంలో ఎకరానికి రూ.100 120 కోట్ల వరకు పలికేవి. ఈ సారి భారీగా పెరిగాయి. ఈ వేలంలో పాల్గొన్న మరో కొన్ని సంస్థలు కూడా పోటీ పడ్డాయి, కానీ ఎంఎస్ఎన్ రియాలిటీస్ అత్యధిక బిడ్‌తో విజయం సాధించింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీలో ఉన్న ఈ భూమి, టీజీఐఐసీ అభివృద్ధి చేస్తున్న ఇండస్ట్రియల్ పార్క్‌లో భాగం. వేలం ప్రక్రియలో మొత్తం 7.67 ఎకరాల భూమి వేలం వేశారు. ఎకరానికి రూ.177 కోట్లు ధర నిర్ణయమై, మొత్తం మొత్తంగా రూ.1,357 కోట్లు వసూలైంది. ఈ ధరలో భూమి అభివృద్ధి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సౌకర్యాలు కూడా చేరుతాయి. ఐటీ కారిడార్ మధ్యలో నాలెడ్జ్ సిటీ, ఫార్మా సిటీ, ఐటీ పార్కుల మధ్య ఈ స్థలం ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా అభివృద్ధి చేయాలని

మిగతా 2లో..



## బీసీలకు ఊరట

- ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో ఊరట
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను
- దాఖలైన పిటిషన్‌ను డిస్మిస్
- విచారణకు స్వీకరించలేమంది
- సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా
- హైకోర్టుకు వెళ్లాలని సూచన

02



## సీజేఐపై దాడికి యత్నం


02

# జూబ్లీహిల్స్ ఏ పార్టీది..?



## జూబ్లీహిల్స్ ఉపఎన్నిక రాజకీయాల్లో మలుపు

- ఎన్నికపై అందరి దృష్టి
- సిట్టింగ్ స్థానం కోసం బీఆర్ఎస్
- అధికార పార్టీగా కాంగ్రెస్
- బీజేపీ హడావుడి ఎక్కువగా



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక తెలంగాణ రాజకీయాల్లో మలుపులకు కారణం కాబోతోంది. అందుకే ఆస్థానంలో జరిగే ఉపఎన్నికపై అందరి దృష్టి పడింది. సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవడానికి బీఆర్ఎస్, అధికార పార్టీగా గెలవాల్సిన అవశ్యకతను కాంగ్రెస్, పుంజుకుంటున్నామని నిరూపించడానికి బీజేపీకి ఈ ఉపఎన్నిక చాలా కీలకంగా మారింది. ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటున్నారు. అయితే జూబ్లిహిల్స్‌లో పరిస్థితి ఎలా ఉందన్నది ఎవరికీ అంతుబట్టడం లేదు. పూర్తిగా నగర నియోజకవర్గం కావడం.. బస్తీల ఓటర్లు ఎక్కువగా ఉండటం, మైనార్టీలు ఫలితాలు తేల్చే స్థాయిలో ఉండటంతో సమీకరణాలే కీలకంగా మారనున్నాయని అంచనా వేస్తున్నారు.

**బీఆర్ఎస్ – ఏదీ కలసి రావడం లేదు...**

జూబ్లీహిల్స్ భారత రాష్ట్ర సమితి సిట్టింగ్ సీటు. మాగంటి గోపీనాథ్ మూడోసారి ఆ నియోజకవర్గం నుంచి గెలిచారు. ఓ సారి టీడీపీ నుంచి రెండు సార్లు బీఆర్ఎస్ నుంచి గెలిచారు. మొదటి సారి టీడీపీ గెల్చినప్పుడు రెండో స్థానంలో మజ్లిస్ ఉంది. కాంగ్రెస్ మూడో స్థానంలో బీఆర్ఎస్ నాలుగో స్థానంలో ఉన్నాయి. వాస్తంగా బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ అక్కడ అంతే. కొత్త ఏర్పడిన ఏర్పడిన కొత్తలో ఉన్న సెంటిమెంట్ ప్రకారం బీఆర్ఎస్ ఓటు బ్యాంక్ 18వేలు.

మిగతా 2లో..



# ఎలి లిల్లీ రూ. 9 వేల కోట్ల పెట్టుబడులు

## ఎలి లిల్లీ రూ. 9 వేల కోట్ల పెట్టుబడులు


- ఫార్మా రంగంలో దిగ్గజ సంస్థ
- ఎలి లిల్లీ తెలంగాణకు
- రూ. 9 వేల కోట్ల పెట్టుబడి
- సీఎం రేవంత్ రెడ్డితో ఎలి లిల్లీ బృందం
- దేశంలో మొదటి యూనిట్
- ప్రపంచ వ్యాప్తంగాఔషధాల సరఫరా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రపంచంలో పేరొందిన ఫార్మా దిగ్గజ కంపెనీ ఎలి లిల్లీ కంపెనీ దేశంలోనే మొదటి సారిగా తమ మాన్యుఫాక్షరింగ్ యూనిట్‌ను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నట్లు ప్రకటించింది. ఈ యూనిట్ ఏర్పాటుకు సుమారు రూ.9000 కోట్లు భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. దీంతో ఎలి లిల్లీ కంపెనీ ప్రపంచ వ్యాప్తంగా తమ ఔషధాల సరఫరా సామర్థ్యాన్ని విస్తరించనుంది.సీఎం రేవంత్ రెడ్డితో చర్చల అనంతరం

మిగతా 2లో..

**“ ఫార్మా రంగంలో దిగ్గజ సంస్థ ఎలి లిల్లీ తన కార్యకలాపాల విస్తరణలో భాగంగా తెలంగాణలో 9 వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఎలి లిల్లీ ప్రతినిధి బృందం సమావేశమైన అంగీకారం తెలియజేసింది. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఆ సంస్థ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, సంస్థ ఇండియా ప్రెసిడెంట్ విన్స్‌లో టూకర్‌తో పాటు ఇతర ప్రతినిధులు రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు.**




# మైనర్ల మత్తు పార్టీ

## హైదరాబాద్‌లో సంచలనం

- ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం
- రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు
- మొయినాబాద్ ఫాంహౌస్
- ట్రాప్ హౌస్.9ఎంఎం' పేరుతో ఇన్‌స్టా
- జంటగా వస్తే రూ.2,800గా పాస్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

మైనర్లు కలిసి మత్తు పార్టీ చేసుకోవడం హైదరాబాద్‌లో సంచలనంగా మారింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన మైనర్లు ఒక గ్రూపుగా ఏర్పడి ఏకంగా ఓ ఫామ్‌హౌస్‌లో మత్తు పార్టీకి హాజరుకావడం కలకలం రేపుతోంది. రాజేంద్రనగర్ ఎస్‌వోటీ పోలీసులు తనిఖీలు చేసి మత్తు పార్టీ గుట్టు రట్టు చేశారు. ఒంటరిగా వస్తే ఒక రేటు,

మిగతా 2లో..

# రేవంత్ కటింగ్ మాస్టర్

- బీజేపీ అంటేనే మోసం
- పూరా బక్వాస్ అంటూ వ్యాఖ్యలు
- బీజేపీ ఎంపీలకు దమ్ముందా
- కేంద్రం మెడలు వంచి పనులు
- రాష్ట్రంలో ఆర్‌ఆర్ టాక్స్ నడుస్తోంది
- పింక్ బుక్‌లో రాసుకుంటాము



## బీజేపీకి హరీష్ రావు సవాల్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ బీజేపీ ఎంపీలకు మాజీ మంత్రి హరీష్ రావు సవాల్ విసిరారు. బీజేపీ అంటే తెలంగాణను మోసం చేసిన పార్టీ అని విమర్శించారు. బీజేపీది సబ్ కా సాత్ సబ్ కా వికాస్ కాదు పూరా బక్వాస్ అంటూ వ్యాఖ్యలు చేశారు. వడ్లకో నీతి.. గోధుమలకో నీతా అని తెలంగాణ బీజేపీ ఎంపీలకు అడిగే దమ్ముందా అని ప్రశ్నించారు. ప్రాంతీయ పార్టీ బలంగా ఉంటే కేంద్రం మెడలు వంచి పనులు చేసుకోవచ్చని.. ఏపీలో టీడీపీ ఇప్పుడు అదే చేస్తుందన్నారు. సీఎం రేవంత్ కేరళ, కర్ణాటక, ఢిల్లీ తిరగడానికి సరిపోతుందని మాజీ మంత్రి ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో ఆర్‌ఆర్ టాక్స్ నడుస్తోందని వ్యాఖ్యలు చేశారు. పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే పింక్ బుక్‌లో రాసుకుంటామని.. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఆ పోలీసుల పని పడతామని హెచ్చరించారు. కేసీఆర్ వచ్చాకే మార్కెట్ కమిటీల్లో బీసీలకు అవకాశం ఇచ్చామని గుర్తుచేశారు. రేవంత్ చీఫ్ మినిస్టర్ కాదు కటింగ్ మాస్టర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. జేబులో కత్తెర పెట్టుకొని కేసీఆర్ చేసిన పనులకు రిబ్బన్ కట్ చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. రిబ్బన్ కత్తిరించడం లేదంటే కేసీఆర్ ఇచ్చిన పథకాలు కట్ చేయడం ఇదే రేవంత్ పని అని అన్నారు. కాళేశ్వరం కూలిందని చెబుతున్న సీఎం రేవంత్ మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు నీళ్లు ఎలా తీసుకువెళ్తున్నారని నిలదీశారు. కేసీఆర్ చెమట ఓడ్చి కట్టిన ప్రాజెక్టు కాళేశ్వరం అని చెప్పుకొచ్చారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు సీఎం రేవంత్ నాన్న కట్టారని నీళ్లు తీసుకువెళ్తున్నారా అంటూ మండిపడ్డారు. తలకిందులుగా తప్పస్సు చేసినా ఇక సీఎం రేవంత్ మాటలను ప్రజలు నమ్మరన్నారు. సంగారెడ్డి జిల్లాలో లక్షా 20 ఎకరాల సాగు కోసం సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు తెచ్చారు కేసీఆర్ అని తెలిపారు. త్వరలో సంగమేశ్వర బసవేశ్వర ప్రాజెక్టు కోసం పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్ పోవాలి కేసీఆర్ రావాలని జనాలు కోరుకుంటున్నారని మాజీ మంత్రి వెల్లడించారు.

కాంగ్రెస్ పార్టీ ప్రామిసరి నోట్, బాండ్ పేపర్‌లకు విలువ లేకుండా చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చారని.. రేవంత్ రెడ్డి వచ్చాక కొత్త పింఛన్లు ఇవ్వలేదు కానీ 2 లక్షల పింఛన్లు తీసేశారని ఆరోపించారు. రెండు నెలల పించన్ ఎగ్గొట్టారన్నారు. కాంగ్రెస్ బాకీ కార్డులను ప్రతీ గ్రామంలో పంచాలని నేతలు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు ఓటు అడగటానికి వస్తే హామీలపై నిలదీయాలన్నారు. కళ్యాణ లక్ష్మి పథకంలో 8 లక్షల తులాల

మిగతా 2లో..



## నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

### పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సిరిసిల్లలో మంత్రి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా నేత కార్మికుల నేసిన చీరలను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కేకే మహేందర్ రెడ్డితో కలిసి మంత్రి పరిశీలించారు. చీరలు నేసే విధానాన్ని దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాల సభ్యులకు

మిగతా 2లో..

# మైనర్ల మత్తు పార్టీ

(మొదటిపేజీ తరువాయి)

జంటగా వస్తే మరో రేటుతో పాస్‌లు ఇచ్చి మరీ మొయినాబాద్ ఫాంహౌస్‌లో పార్టీ నిర్వహించారని పోలీసులు గుర్తించారు.

**అసలేం జరిగిందంటే..**

నగరానికి చెందిన ఓ డీజే 'ట్రాప్ హౌస్.9ఎంఎం' పేరుతో ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ క్రియేట్ చేశాడు. ఇ ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌తో యాక్టివ్‌గాఉండే మైనర్ల టార్గెట్ చేశాడు. ఆ డీజే మొయినాబాద్‌లోని ఓ ఫామ్‌హౌస్‌లో ట్రాప్ హౌస పేరుతో పార్టీ నిర్వహిస్తున్నట్లు ప్రచారం చేశాడు. ఇది సాధారణ పార్టీ కాదని, ఇందులో హద్దులు లేని ఎంజాయ్‌మెంట్ సరదా ఉంటుందని మైనర్లను ఆకర్షించాడు. ఈ పార్టీకి పాస్‌లు తప్పనిసరి అనే కండీషన్ పెట్టాడు. పార్టీకి ఒక్కరు హాజరుకావాలంటే రూ.1,600 పాస్, జంటగా వస్తే రూ.2,800గా పాస్ ధర నిర్ణయించాడు. ఇన్‌స్టాలో ఈ ప్రకటనను చూసిన మైనర్లు పార్టీకి ఉత్సాహంగా సిద్ధమయ్యారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 50 మంది మైనర్లు శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మొయినాబాద్‌లోని ఓక్స్ ఫామ్‌హౌస్‌లో ట్రాప్ హౌస్ పార్టీని ఆ డీజే ఏర్పాటు చేశాడు.

**పక్కా సమాచారంతో ఎస్ఓటీ పోలీసుల ఎంట్రీ..**

వారంతా మైనర్లే.. హద్దులు లేని ఎంజాయ్‌మెంట్ పార్టీకి హాజరయ్యారు. పార్టీ జోరుగా సాగుతుండగా, రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు అకస్మాత్తుగా మొయినాబాద్ ఓక్స్ ఫాంహౌస్‌పై దాడి చేశారు. పార్టీలో పాల్గొన్న వారికి డ్రగ్ టెస్టులు నిర్వహించగా, ఇద్దరు మైనర్లు గంజాయి తీసుకున్నట్లు తేలింది. పోలీసులు ఆరుగురు నిర్వాహకులను అదుపులోకి తీసుకుని, 6 విదేశీ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని మొయినాబాద్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నవంబర్ 11 జూబ్లీహిల్స్ పోలింగ్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి ఉపఎన్నికకు ఎన్నికల కమిషన్ (ఈసీఐ) షెడ్యూల్ ప్రకటించింది. బిహార్ ఎన్నికలతోపాటు దేశవ్యాప్తంగా ఖాళీ అయిన పలు పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు నిర్వహిస్తోంది ఎన్నికల సంఘం. అందులో తెలంగాణలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం కూడా ఉంది. ఇక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మృతితో ఇక్కడ ఎన్నికలు నిర్వహిస్తోంది.

**జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పూర్తి షెడ్యూల్ ఇదే**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నోటిఫికేషన్ ఎప్పుడు 13 అక్టోబర్ 2025
జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నామినేషన్‌కు తుది గడువు 21102025
జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నామినేషన్ స్క్రూటినీ ఎప్పుడు 22102025
జూబ్లీహిల్స్ ఉపఎన్నిక నామినేషన్ ఉపసంహరణ ఎప్పుడు 24102025
జూబ్లీహిల్స్ ఉపఎన్నిక పోలింగ్ ఎప్పుడు: 11112025

బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ 8జూన్ 2025న మరణించడంతో ఖాళీ అయిన సీటుకు ఇప్పుడు ఉపఎన్నిక జరగనుంది. ఇప్పటికే పార్టీలు అభ్యర్థులు ఎంపిక చేస్తున్న మధ్య, ఎన్నికల సంఘం బిహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఈ షెడ్యూల్‌ను ప్రకటించనుంది. జూబ్లీహిల్స్, హైదరాబాద్‌లోని ప్రముఖ రెసిడెన్షియల్ ప్రాంతం, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో భాగం. ఈ ఉపఎన్నికలో 3.92 లక్షల మంది ఓటర్లు తమ హక్కు ఉపయోగించుకోవచ్చు. డ్రాఫ్ట్ ఎలక్టరల్ రోల్‌ను సెప్టెంబర్ 2న విడుదల చేసిన ఎన్నికల అధికారులు, క్లెయిమ్స్ & ఆబ్జెక్షన్స్‌ను సెప్టెంబర్ 25 వరకు స్వీకరించారు.




ఫైనల్ ఎలక్టరల్ రోల్ సెప్టెంబర్ 30న ప్రచురించారు. అగస్టు 20 నాటి డ్రాఫ్ట్ ప్రకారం పురుషులు 2.04,167, మహిళలు 1,88,213 మంది. ట్రాన్స్‌జెండర్ ఓటర్లు 25 మంది. ప్రత్యేక అవసరాలతో ఉన్న (పీడబ్ల్యూడీ) ఓటర్లు 1,858 మంది, 80 ఏళ్లు పైబడినవారు 6,049 మంది. జెండర్ రేషియో 920:1000. సర్వీస్ వోటర్లు 18 మంది, ఎన్ఆర్ఐలు 96 మంది. తుది జాబితాలో 3.99 లక్షలకు పెరిగినట్టు అధికారిక వర్గాలు తెలిపాయి. ఓటర్లు తమ పేరు లిస్ట్‌లో ఉందో తనిఖీ చేసుకోవాలని ఈసీఐ పిలుపునిచ్చింది. ఫారం6 ద్వారా కొత్త ఓటర్లు, ఫారం7 ద్వారా తొలగింపు, ఫారం8 ద్వారా సవరణలు చేసుకోవచ్చు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 407 పోలింగ్ బూతులు 139 లొకేషన్లలో ఏర్పాటు చేశారు. ఇందులో 183 బూతుల్లో 1,200 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నారు. అయితే, ఏ బూతులోనూ 1,500 మందికి మించి ఓటర్లు ఉండకుండా రేషనలైజేషన్ పూర్తి చేశారు. ప్రతి బూతు ఓటర్ నివాసానికి 2 కి.మీ. దూరంలో ఉండేలా చూశారు. బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) 3,500 మంది శిక్షణ పొందారు. మొబైల్ ఫోన్లు బూతు వెలుపల డిపాజిట్ చేయాలి. ఈసీఐ కొత్త యాప్‌లు, ఈసీఐనెట్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు ఉపయోగించి పారదర్శకత పెంచారు. ఈ ఉపఎన్నిక జకీయాల్లో ప్రతిష్టాత్మకమైనది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ గెలిచారు. మహ్మద్ అజారుద్దీన్ కాంగ్రెస్ తరపున పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. సిట్టింగ్ సీటును కాపాడుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. బీజేపీ కూడా బలమైన అభ్యర్థిని రంగంలోకి దించాలని ప్రయత్నిస్తోంది. జూబ్లిహిల్స్‌లో ముక్కోణపు పోటీ జరగనుంది.

**భవిష్యత్ ప్రభావం**

ఈ ఉపఎన్నిక ఫలితం తెలంగాణ రాజకీయాల్లో కీలకమవుతుంది. కాంగ్రెస్ గెలిస్తే, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బలం పెరుగుతుంది. బీఆర్ఎస్ లేదా బీజేపీ గెలిస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుంది. ఓటర్లు ఈ ఎన్నికలో పాల్గొనాలని, తమ ఓటర్ ఐడీలు, వివరాలు తనిఖీ చేయాలని ఎన్నికల సంఘం పిలుపునిచ్చింది. ఎక్కువ వివరాలకు ceotelangana.nic.in వెబ్‌సైట్ చూడండి లేదా స్థానిక బూత్ లెవల్ అధికారిని సంప్రదించండి.

# జూబ్లీహిల్స్ ఏ పార్టీది..?

(మొదటిపేజీ తరువాయి)

ఆ తర్వాత రెండు ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ పోటీ చేయలేదు. బీఆర్ఎస్‌కు పరోక్షంగా మద్దతు ఇచ్చింది. మాగంటి గోపీనాథ్ రెండు సార్లు విజయంలో మజ్లిస్ కీలకం. ఇప్పుడు మజ్లిస్ పార్టీ బీఆర్ఎస్ పార్టీకి సపోర్టుగా లేదు. పలువురు నేతలు మాగంటి గోపీనాథ్ జీవించి ఉన్నప్పుడే ఆయనతో విబేధించి పార్టీ నుంచి వెళ్లిపోయారు. కాంగ్రెస్ నుంచి వచ్చిన విష్ణువర్ధన్ రెడ్డి వల్ల ఎంత ఉపయోగమో బీఆర్ఎస్‌కే అర్థం కావడం లేదు. కనీసం సానుభూతి అయినా గట్టెక్కిస్తుందన్న ఆశతో.. మాగంటి సునీతకే టిక్కెట్ ఖరారు చేశారు.



**కాంగ్రెస్ పార్టీకి మజ్లిసే బలం..**

కాంగ్రెస్ పార్టీ అధికార హోదాలో ఉంది. గత ఎన్నికల్లో అజహర్‌కు చివరి క్షణంలో టిక్కెట్ ఖరారు చేశారు. అయినప్పటికీ ఆయన రెండో స్థానంలో నిలిచారు. పదహారు వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. మజ్లిస్ అభ్యర్థి బరిలో లేరు. పరోక్షంగా బీఆర్ఎస్ పార్టీకి సహకరించారు. అజహర్ కోసం కొంత క్రాస్ ఓటింగ్ జరిగినా అది గెలుపు ఇవ్వలేదు. ఈ సారి కాంగ్రెస్ పార్టీకి అడ్వాంటేజ్ గా మజ్లిస్ పార్టీనే నిలుస్తోంది. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీకి సహకరించడం మజ్లిస్ నైజం. ఓట్లు చీల్చడానికి అయినా.. ఓట్లు వేయించడానికి అయినా.. మజ్లిస్ బాగా ఉపయోగపడుతుంది. స్థానికంగా బస్తీల్లో పట్టు ఉన్న నవీన్ యాదవ్ ను అభ్యర్థిగా నిలబెట్టాలని అనుకుంటున్నారు. అందుకే.. కాంగ్రెస్ పార్టీ ఎక్కువ నమ్మకంతో ఉంది. పార్టీలో అంతర్గత సమస్యలు పెద్దగా ప్రభావం చూపవని అనుకుంటున్నారు.

**బీజేపీ పెద్దగా ప్రయత్నించడం లేదు.**

గతంలో ఉపఎన్నికలు అంటే.. బీజేపీ హడావుడి ఎక్కువగా ఉండేది. దుబ్బాక అయినా.. హుజూరాబాద్ అయినా.. మునుగోడు అయినా ఉపఎన్నికల్లో బీజేపీ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్లుగా సాగేది. కానీ ఇప్పుడు బీజేపీ ఉపఎన్నికనపై పెద్దగా దృష్టి పెట్టలేదు. సాధారణంగా ఉపఎన్నిక వస్తే చాలా పెద్ద కసరత్తు ఆ పార్టీ చేస్తుంది. ఈ సారి మాత్రం చేయడం లేదు. అభ్యర్థిని నిలబెడుతుంది. ఆ పార్టీకి స్థిరమైన ఓటు బ్యాంక్ ఉంది. అది ఏ పార్టీకి మారదు. అందుకే బలంగా ఓట్లను చీలుస్తుంది కానీ.. గెలుపు రేసులో ఉండకపోవచ్చని భావిస్తున్నారు. మొత్తంగా జూబ్లిహిల్స్ లో పోటీ .. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే సాగనుంది. మజ్లిస్ మద్దతు, అధికార పార్టీ అడ్వాంటేజ్ , రేవంత్ వ్యూహాలు కాంగ్రెస్ పార్టీకి స్వల్ప అడ్వాంటేజ్ చూపిస్తున్నాయని అనుకోవచ్చు.

# సీజేఐపై దాడికి యత్నం

**సర్వోన్నత న్యాయస్థానం అనూహ్య ఘటన చోటు**
**ఓ కేసు విచారణ సమయం**
**సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్**
**చెప్పుతో దాడికి ప్రయత్నం**
**నిందితుడు న్యాయవాది రాకేష్**
**సీఎం రేవంత్ రెడ్డి ఖండించారు**

**విశాలభారతి, జాతీయం:**

భారతదేశ సర్వోన్నత న్యాయస్థానంలో అనూహ్య ఘటన చోటు చేసుకుంది. ఓ కేసు విచారణ సమయంలో సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్‌పై ఒక న్యాయవాది చెప్పుతో దాడికి ప్రయత్నించాడు. సీజేఐపై షూ విసిరేందుకు ప్రయత్నించాడు. దీంతో తోటి న్యాయవాదులు, భద్రతా సిబ్బంది అడ్డుకుని అతనిని పోలీసులకు అప్పగించారు. నిందితుడు న్యాయవాది రాకేష్ కిషోర్‌గా పోలీసులు గుర్తించారు. అయితే ఈ ఘటనకు ముందు'సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించేది లేదు'అంటూ న్యాయవాది కేకలు వేసినట్లు తోటి న్యాయవాదులు తెలిపారు.

**బెదిరింపులకు భయపడేది లేదు: జస్టిస్ బీఆర్ గవాయ్...**

సుప్రీంకోర్టులో తనపై దాడికి యత్నించిన ఘటనపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ స్పందించారు. ఇలాంటి బెదిరింపులకు తాను భయపడేది లేదని స్పష్టం చేశారు. అనంతరం యథాప్రకారం కోర్టు ప్రొసీడింగ్స్ కొనసాగించారు. నిందితుడిని ఢిల్లీ డీసీపీ, సుప్రీంకోర్టు భద్రతా అధికారులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. హిందూ దేవుళ్లపై సీజేఐ చేసిన వ్యాఖ్యలే ఈ దాడికి దారితీసి ఉండవచ్చని సుప్రీంకోర్టు న్యాయవాది రోహిత్ పాండే తెలిపారు. ఈదాడి యత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని...నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు న్యాయవాది రోహిత్ పాండే డిమాండ్ చేశారు. మరోవైపు దాడికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిషోర్‌ను విడిచిపోట్టాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ ఆదేశించారు.



**విష్ణుమూర్తి ఆలయం పునర్నిర్మాణం కేసు విచారణ...**

జవారి ఆలయంలోని ఏడడుగులు విష్ణుమూర్తి విగ్రహాన్ని పునర్నిర్మించి, పునఃప్రతిష్ఠించేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సెప్టెంబర్ 16న సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ తోసిపుచ్చారు. ఇది ప్రచారం కోసం వేసిన పిటిషన్‌గా అభివర్ణించారు.'ఇది ఖచ్చితంగా పబ్లిసిటీ ఇంట్రెస్ట్ లిటిగేషన్. ఏదైనా చేయమని ఆయననే వెళ్లి అడగండి. ఇది చేస్తే మీరు విష్ణువుకు మంచి భక్తుడనిపించుకుంటారు. ఆయనను ప్రార్థించి, మెడిటేషన్ చేయండి'అని సీజేఐ సూచించారు. ఇది పూర్తిగా భారత పురావస్తు పరిశోధనా సంస్థ పరిధిలోకి వస్తుందని ఆ సంస్థ అనుమతి ఇస్తుందో లేదో తెలియదంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈలోపు మీరు శైవానికి వ్యతిరేకం కాకుంటే అక్కడికి వెళ్లి ప్రార్థించండి. అక్కడ చాలా పెద్ద శివలింగం ఉంది. అది ఖజరహోలోనే అతిపెద్దది'అని సీజేఐ వ్యాఖ్యానించారు. అయితే ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ఈ ప్రచారంపై సీజేఐ బీఆర్ గవాయ్ స్పందించారు. తాను అన్ని మతాలను గౌరవిస్తానని అయితే తన వ్యాఖ్యలను వక్రీకరించారని అభిప్రాయపడ్డారు.

**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఖండించారు..**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడి యత్నాన్ని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఖండించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా రేవంత్ ట్వీట్ చేశారు. దేశ న్యాయవ్యవస్థలోని అత్యున్నత అధికారిపై దాడి చేసి బెదిరించడానికి జరిగిన దుర్మార్గపు ప్రయత్నాన్ని తాను మాటల్లో ఖండించలేనని చెప్పారు. ఇది మన దేశ చరిత్రలో చీకటి రోజు అని ముఖ్యమంత్రి అభివర్ణించారు. ఇటువంటి పిరికి దాడులకు తాను భయపడబోనని ధైర్యంగా ప్రకటించిన ధైర్యవంతుడైన ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్ కి దేశ పౌరులతో కలిసి తాను సంఘీభావం ప్రకటిస్తున్నట్లు రాసుకొచ్చారు..

**ఖండించిన జ్యోతిరావ్ పూలే ఆల్ ఇండియా ఓబీసీ అసోసియేషన్...**

సుప్రీంకోర్టులో జరిగిన ఘోరమైన ఘటనను తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు జ్యోతిరావ్ పూలే ఆల్ ఇండియా ఓబీసీ అసోసియేషన్ తెలిపింది. సుప్రీంకోర్టు విచారణ జరుగుతున్న సమయంలో ఒక న్యాయవాది భారత ప్రధాన న్యాయమూర్తి బి. ఆర్. గవాయ్ పై చెప్పును విసరడానికి ప్రయత్నించడం ఒక పిరికితనమైన మరియు అసభ్యకరమైన చర్యగా అభివర్ణించింది. ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడి మాత్రమే కాదు.. న్యాయవ్యవస్థ గౌరవం, చట్ట పరిపాలన మరియు ప్రజాస్వామ్య మర్యాదలపై జరిగిన దాడిగా అభివర్ణించింది. భారత ప్రధాన న్యాయమూర్తి గవాయ్ సత్యనిష్ఠత కలిగిన న్యాయవేత్త మరియు చారిత్రకంగా వెనుకబడిన వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తి. ఆయన భారతదేశపు మొదటి బౌద్ధ ప్రధాన న్యాయమూర్తి మరియు రెండవ దళిత ప్రధాన న్యాయమూర్తి అని జ్యోతిరావ్ పూలే ఆల్ ఇండియా ఓబీసీ అసోసియేషన్ అభిప్రాయపడింది.జస్టిస్ ఆర్ గవాయ్ దళిత సమాజానికి చెందినవారని చెప్పడం ఆయన స్థాయిని తగ్గించదు. దానికి విరుద్ధంగా ఇది ఈ దాడి యొక్క నీచతను మరింత స్పష్టంగా చూపిస్తుంది, ఎందుకంటే చరిత్రలో సామాజికంగా అణగారిన వర్గాలపై జరిగిన అవమానాలు, హింసలకు ఇది మరొక ఉదాహరణ అని వ్యాఖ్యానించింది.

# బీసీలకు ఊరట

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. హైకోర్టుకు వెళ్లి తేల్చుకోవాలని అత్యున్నత న్యాయస్థానం.. పిటిషనర్ వంగ గోపాల్ రెడ్డికి తెలిపింది. ఈ మేరకు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం సూచించింది. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున విచారణకు స్వీకరించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టు స్టే ఇవ్వనందున సుప్రీంకోర్టుకు వచ్చామని పిటిషనర్ తరపు న్యాయవాది చెప్పారు. హైకోర్టు స్టే ఇవ్వకుంటే సుప్రీంకోర్టుకు వచ్చేస్తారా అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. తర్వాత పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం డిస్మిస్ చేసింది. ఈ క్రమంలో హైకోర్టుకు వెళ్లాలని సూచించింది. పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్టుగా చెప్పడంతో తమ పిటిషన్‌ను వెనక్కు తీసుకునేందుకు పిటిషనర్ తరపు న్యాయవాది అంగీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు సిద్దార్ధదవే, అభిషేక్ సింఘ్వీ, ఎడీఎన్ రావు హాజరయ్యారు. విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టులో ఇదే అంశంపై రెండు పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు వెల్లడించారు. ఆర్టికల్ 32 కింద పిటిషన్ ఎందుకు ఫైల్ చేశారని పిటిషనర్‌ను అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ.. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోపై స్టే ఇవ్వాలని గోపాల్‌రెడ్డి పిటిషన్ వేశారు. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం దాటుతున్నాయని చెప్పారు. గతంలో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పిటిషన్‌లో ప్రస్తావించారు. ఇది చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. విచారణ సందర్భంగా తెలంగాణ హైకోర్టు స్టే ఇవ్వడానికి నిరాకరించింది. దీంతో సుప్రీం కోర్టు వెళ్లగా.. అత్యున్నత న్యాయస్థానం తాజాగా పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్టుగా చెప్పింది.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవో నెంబర్ 9పై స్టే కోసం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు డిస్మిస్ చేయడంతో తెలంగాణ ప్రభుత్వానికి బిగ్ రిలీఫ్ దక్కింది. విచారణకు స్వయంగా తెలంగాణ మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి హాజరు అయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ..'సుప్రీంకోర్టు తీర్పు శుభ పరిణామం. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఆపాలని సుప్రీంకోర్టులో వేసిన కేసును కోర్టు కొట్టి వేయడాన్ని స్వాగతిస్తున్నాం. కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తాం. ఇప్పటికే ప్రభుత్వం మూడు చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బీసీ రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసింది. ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌లు రిజర్వేషన్ల అమలు కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. ఎనిమిదో తేదీన హైకోర్టులో కూడా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నాము. బీసీలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు కోసం అన్ని వర్గాలు ప్రభుత్వానికి సహకరించాలి' అని కోరారు.

మరోవైపు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ..'ప్రభుత్వం తరపున బలమైన వాదనలు వినిపించాం. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా వేసిన పిటిషన్ కొట్టేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నాం. రిజర్వేషన్ల కోసం జీవో కూడా విడుదల చేశాం' అని చెప్పుకొచ్చారు.

# రాయదుర్గం @ ఎకరం రూ.177 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ప్లాన్. గత రెండు సంవత్సరాలుగా ఇక్కడ భూమి ధరలు రెండు రెట్లు పెరిగాయి. ఈ వేలం ద్వారా ప్రభుత్వానికి విపులమైన ఆదాయం లభించడంతో, మరిన్ని ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు మార్గం సుగమమవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఎంఎస్ఎన్ రియాలిటీస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ. ఈ సంస్థ గతంలో కూడా రాయదుర్గం ప్రాంతంలో పెద్ద భూములు కొనుగోలు చేసి, కమర్షియల్, రెసిడెన్షియల్ ప్రాజెక్టులు అభివృద్ధి చేసింది. ఈ కొత్త భూమిపై ఐటీ పార్కులు, కార్పొరేట్ ఆఫీసులు నిర్మించే అవకాశం ఉంది.

# నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

త్వరలోనే చీరలు పంపిణీ చేస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్ ఆదేశాలతో నేతన్నలకు 64 లక్షల చీరలు ఆర్డర్ ఇచ్చామని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో నేతన్నలకు మరిన్ని ఆర్డర్లు ఇచ్చి ఆర్థికంగా చేయూతనిస్తామన్నారు. నేతన్నలకు ఉపయోగ పడే యారన్ డిపోను రూ.50 కోట్లతో వేములవాడలో ఏర్పాటు చేశామన్నారు. మహిళా సంఘాల బలోపేతనికి ప్రభుత్వం కృషి చేస్తోందని, వారి కోసం ఏకరూప దుస్తులను కూడా పంపిణీ చేస్తామన్నారు. నేత కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మార్కెట్ కమిటీల చైర్మన్లు, జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# రేవంత్ కటింగ్ మాస్టర్

(మొదటిపేజీ తరువాయి)

బంగారం కాంగ్రెస్ పార్టీ బాకీ పడిందని తెలిపారు. నిరుద్యోగ యువతకు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. రేవంత్ ఎన్నికల ముందు రజినీకాంత్.. తర్వాత గజిని కాంత్‌లా అయ్యారంటూ సెటైర్ విసిరారు. ఫ్యూచర్ సిటీలో రోడ్లు, మూసీ సుందరీకరణ కోసం నిధులు ఉంటాయని.. ప్రజలకు ఇచ్చే పథకాల కోసం మాత్రం నిధులు ఉండవని ఆయన అన్నారు. కేసీఆర్ 33 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేస్తే రేవంత్ 19 వేల కోట్ల రూపాయలే రుణమాఫీ చేశారన్నారు. రైతులకు యూరియా సరఫరా చేయలేని దద్దమ్మ, చేతగాని ప్రభుత్వం ఈ కాంగ్రెస్ ప్రభుత్వమని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ గెలవడం పక్కా అంటూ మాజీ మంత్రి హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# ఎలి లిల్లీ రూ. 9 వేల కోట్ల పెట్టుబడులు

(మొదటిపేజీ తరువాయి)

ఎలి లిల్లీ కంపెనీ తమ విస్తరణ ప్రణాళికలు, తెలంగాణలో భారీ పెట్టుబడులకు సంబంధించి కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో దేశంలో అధునాతన తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేసింది.

విస్తరణలో భాగంగా భారీ పెట్టుబడులతో ముందుకు రావటంపై ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సంస్థను ప్రశంసించారు. తెలంగాణపై విశ్వాసం ఉంచినందుకు కంపెనీ ప్రతినిధులను అభినందించారు. పెట్టుబడులతో వచ్చే కంపెనీలు, పరిశ్రమలకు తమ ప్రభుత్వం అన్ని రకాలుగా మద్ధతు ఇస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్ ఇప్పటికే దేశంలోనే ఫార్మా హబ్‌గా ప్రఖ్యాతి గడించిందని, ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. 1965లో ఇందిరాగాంధీ ఐడీపీఎల్‌ను హైదరాబాద్‌కు తీసుకురావడంతో ఫార్మా రంగం విస్తరించిందని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. పేరొందిన దిగ్గజ ఫార్మా కంపెనీలుండటంతో దేశంలో 40 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయని చెప్పారు. కోవిడ్ వ్యాక్సిన్లను ఇక్కడే తయారు చేసిన విషయాన్ని పేర్కొన్నారు. ఫార్మా కంపెనీలను ప్రోత్సహించే ఫార్మా పాలసీని ప్రభుత్వం అనుసరిస్తుందని చెప్పారు. జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, జీనోమ్ వ్యాలీకి కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేయబోయే ఈ మాన్యుఫాక్చరింగ్, క్వాలిటీ సెంటర్ తమకు అత్యంత కీలకమైందని కంపెనీ పేర్కొంది. ఇక్కడి నుంచే దేశంలో ఉన్న ఎలి లిల్లీ కాంట్రాక్ మాన్యుఫాక్షరింగ్ నెట్వర్క్, సాంకేతిక పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ, అధునాతన సాంకేతిక సామర్థ్యాలను అందించనుంది. అమెరికాకు చెందిన ఎలి లిల్లీ కంపెనీకి 150 ఏళ్లుగా ప్రపంచ వ్యాపంగా ఔషధాల తయారీ రంగంలో విశేషమైన వైద్య సేవలను అందిస్తుంది. ప్రధానంగా డయాబెటిస్, ఒబెసిటీ, ఆల్జీమర్, క్యాన్సర్, ఇమ్యూన్ వ్యాధులకు సంబంధించిన ఔషధాలు, కొత్త ఆవిష్కరణలపై ఈ కంపెనీ పని చేస్తుంది. ఇండియాలో ఇప్పటికే గురుగ్రామ్, బెంగుళూరులో ఎలి లిల్లీ కంపెనీ కార్యకలాపాలు కొనసాగిస్తోంది. హైదరాబాద్‌లో ఈ ఏడాది ఆగస్ట్ నెలలో గ్లోబల్ కెపాబులిటీ సెంటర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే.

# కొత్తకొండ రంగయ్య మేరు కుటుంబానికి పరామర్శ

**పాలకుర్తి, విశాలభారతి:**

మండలం చెన్నూరు గ్రామానికి చెందిన కొత్తకొండ కాంతయ్య మేరు తండ్రి రంగయ్య "90 సం" కొద్దిరోజుల క్రితం మృతి చెందగా, జనగామ జిల్లా నీరు సంఘం కమిటీ వారి ఇంటి వద్దకు వెళ్లి వారి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా మేరు సంఘం అధ్యక్షులు రాపర్తి ప్రశాంత్, జిల్లా కోశాధికారి దీకొండ విష్ణు, మరియు జిల్లా కమిటీ సభ్యులు సోమ.సత్యం, పాలకుర్తి మేరు సంఘం అధ్యక్షులు కీర్తి రాజకమల్, కీర్తి యాదగిరి, సంఘ వెంకట్ నారాయణ, కొత్తకొండ రవి, వెన్న సుధాకర్, రామగిరి విజయ్, మేరు సంఘం జిల్లా నాయకులు, మేరు సంఘం కులపెద్దలు తదితరులు పాల్గొన్నారు.





# ఆలయ అభివృద్ధికి మొదటి నెల వేతనం విరాళం

**కొలువుల కల్పవల్లిగా విరాజిల్లుతున్న అమ్మవారు**
**చదువులతల్లికి హృదయ నీరాజనం**
**దేవాలయానికి రూ. 1,01,116 విరాళం**

**ఇబ్రహీంపట్నం , విశాలభారతి:**

యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామంలోని జ్ఞాన సరస్వతి దేవి ఆలయం అభివృద్ధికి ఆరుట్ల గ్రామానికి చెందిన తాదూరి భార్గవి వెంకట్ రెడ్డి (గౌతమి విద్యాలయం నందివనపర్తి) కుమార్తె తేజస్వి సాఫ్ట్వేర్ ఇంజనీర్ ఉద్యోగం వస్తే నెల వేతనం అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఇస్తానని మొక్కుకుంది. దీంతో తేజస్వి కి క్వాడిస్టర్ (యు.ఎస్.ఎ) లో సాఫ్ట్ వేర్ ఉద్యోగం వచ్చింది. ఆమె మొదటి నెల వేతనం రూ. 1,01,116 విరాళం అందించింది. ఈమేరకు సోమవారం తేజస్వి తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తన మొక్కును చెల్లించుకుంది. జ్ఞాన సరస్వతి దేవాలయం ఫౌండేషన్ చైర్మన్ సదా వెంకట్, ఆలయ నిర్వాహకులు మూడేడ్ల వెంకట్ రెడ్డి , కొండూరి శేఖర్ లు పాల్గొని సత్కరించారు.

# ఎన్నికలను అధికారులు సమర్ధవంతంగా నిర్వహించాలి

- అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్
- నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తాం :– డీసీపీ సునీతా రెడ్డి

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**



రెండవ సాధారణ పంచాయతీ ఎన్నికలను నోడల్ అధికారులు, పోలింగ్ అధికారులు తమ విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణరెడ్డి తెలిపారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పోలీస్ అధికారులు, ఎంపీడీవోలు, ఎన్నికల నోడల్ అధికారులు, అడిషనల్ కలెక్టర్లతో కలిసి జిల్లాస్థాయి సమన్వయ సమావేశంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నామినేషన్ ప్రక్రియ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ ప్రక్రియ, నామినేషన్ల పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా తదితర అంశాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. విధులు కేటాయించిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఖచ్చితంగా పాటించాలని ఆయన అధికారులకు సూచించారు. మండల స్థాయి ఎన్నికల అధికారులు ఒక టీం గా ఏర్పడి సమన్వయంగా పని చేయాలని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సభలు, ర్యాలీలు సమావేశాల కొరకు అనుమతి పొందాల్సి ఉంటుందని సంబంధిత సమాచారాన్ని ఖర్చుల పర్యవేక్షణ బృందానికి అందించనట్లైతే నిబంధనలకు లోబడి ఖర్చుల పరిశీలన చేస్తారని అన్నారు. సరైన అనుమతులు లేకుండా సభలు సమావేశాలు నిర్వహించకూడదని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫ్లయింగ్ సర్వేలెన్స్ టీం, స్టాటిస్టిక్ సర్వేలెన్స్ టీంలు, ఆయా టీంలలో పోలీసు శాఖ సిబ్బంది తప్పని సరిగా ఉండాలని ఆయన తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని తెలిపారు. పోలీసు శాఖ అన్ని శాఖలతో సమన్వయంగా పనిచేస్తూ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించడం జరుగుతుందని డిసిపి సునీతారెడ్డి తెలిపారు. అడిషనల్ డిసిపిలు సమస్యాత్మక గ్రామాలను త్వరలో గుర్తించి తగిన విధంగా బందోబస్తు ఏర్పాట్లకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, సైబరాబాద్ పోలీస్ శాఖ అడిషనల్ డీసీపీలు, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్, అబ్కారి శాఖ సుపరిడెంట్లు కృష్ణప్రియ, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, రెవెన్యూ డివిజినల్ అదికారులు, ఎంపీడీవోలు తదితర అధికారులు పాల్గొన్నారు.



## ఎన్నికలపై బిజెపి ముఖ్య కార్యకర్తల సమావేశం

- మండల అధ్యక్షులు పెంబళ్ల జానయ్య
- కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

**మునుగోడు, విశాలభారతి:**

మండల కేంద్రంలో సత్య ఫంక్షన్ హాల్ లో బిజెపి పార్టీ మండల అధ్యక్షులు పెంబళ్ల జానయ్య ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సంస్థల ఎన్నికలపై మండల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎన్నికలపై పాత కొత్త రిజ ర్వేషన్ల ప్రాతిపదికన అభ్యర్థుల జాబితాను రూపొందించుటకు చర్చలు జరిపారు. ఎన్నికల్లో పార్టీ తరుపున పోటీ చేసి గెలుపే లక్ష్యంగా పని చేయాలనీ అన్నారు. ఈ మేరకు సమర్థవంతమైన అభ్యర్థుల పలువురు పేర్లను పార్టీ నాయకులు పరిశీలించి వారి వివరాలను అధిష్టానానికి పంపాలని చర్చించారు. అందులో భాగంగా ఆశావాహులు ఎవరైతే ఉన్నారో వారి అభ్యర్థనను స్వీకరించారు. అర్హులైన ప్రతి కార్యకర్త ఏదో ఒక స్థానంలో పోటీ చేసి గెలుపొందాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల ఎన్నికల ఇన్చార్జి దర్శనం వేణు కుమార్, బిజెపి రాష్ట్ర నాయకులు భవనం మధుసూదన్ రెడ్డి, బిజెపి మాజీ జిల్లా కార్యదర్శి బూడిగా అశోక్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పులకరం సైదులు,జిల్లా నాయకులు వేదాంతం గోపీనాథ్, మాధగోని నరేందర్ గౌడ్, నీరుడు రాజారాం, కర్నాటి లింగయ్య, పర్నె అంతి రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు ముచ్చపోతుల స్రవంతి, మండల ప్రధాన కార్యదర్శి అక్కెనపల్లి సతీష్, పందుల యాదయ్య, కర్నాటి శేఖర్, కొత్త శంకర్,ఒడిగ స్వామి, జెల్ల రవితేజ, పెరమాండ్ల రాము, నెల్లికంటి పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**చౌటుప్పల్, విశాలభారతి:**

మండలంలోని మల్కాపురం గ్రామ పరిధిలోని గల హెచ్ పి పెట్రోల్ బంకు ఎదుట గుర్తు తెలియని శవం ఉన్న విషయాన్ని తెలుసుకున్న గ్రామ పంచాయతీ సెక్రెటరీ పి.రమాదేవి వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం జరిగింది.మృతుడు సుమారు 50 నుండి 60 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వ్యక్తి,ఎత్తు 5.4,గా గుర్తింపు,మృతుడు ఆహారం లేక గాని అనారోగ్య సమస్యల వల్ల గాని మరణించి ఉండవచ్చు అని అనుమానాలు.వెంటనే పోలీసులు ఘటణా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఇంకా మృతుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.




## జన్మదినం అంటే వేడుక కాదు.. సామాజీక బాధ్యత

**మహబూబాబాద్, విశాలభారతి:**



మహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా"భూక్యా మురళీ నాయక్ గారి జన్మదిన వేడుకలు సామాజిక సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా మహబూబాబాద్ పట్టణ యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గడిపెల్లి చరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అజ్మీరా సురేష్ నాయక్ నేతృత్వంలో జిల్లా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు కలిసి మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఉదయం ప్రారంభమైన ఈ శిబిరంలో యువత, మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. జన్మదినం అంటే కేవలం వేడుక కాదు, సమాజానికి ఉపయోగపడే రోజుగా మార్చుకోవాలి అనే ఎమ్మెల్యే మురళీ నాయక్ సిద్ధాంతం మేరకు పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమం నిర్వహించారు. రక్తదానానికి ముందుకు వచ్చిన యువతకు ఫోన్ లో ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. చివరగా కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా సీనియర్ నాయకులు దేవారం ప్రకాష్ రెడ్డి, రమేష్ చందర్ రెడ్డి, అంబటి మహేందర్ రెడ్డి, మిట్ట కంటి రాంరెడ్డి, చిట్టే వెంకన్న,ఖలీల్ పాషా, రమేష్, బోడ రవి,బెల్లంకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.




## తొర్రూరు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

### డిఎంహెచ్ఓ డాక్టర్ రవి రాథోడ్

**తొర్రూరు, విశాలభారతి:**

తొర్రూరు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని డిఎంహెచ్ఓ డాక్టర్ రవి రాథోడ్ అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు అధ్యక్షులు డాక్టర్ సూర్నం రామ నర్సయ్య ఆధ్వర్యంలో గోశాల అధ్యక్షులు లయన్ దారం కుమార స్వామి పుట్టినరోజు సందర్భంగా వారి ఆర్థిక సహకారంతో డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో అల్పాహార వితరణ,పర్యావరణపై అవగాహన కల్పించి జ్యూట్ బ్యాగుల పంపిణీ, మొక్కలను నాటి,వివిధ వ్యాధులపై అవగాహన కల్పించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ... లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు అండగా నిలిచి వారికి అందిస్తున్న సేవలను మరువలేరన్నారు.ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ సుధీర్ రెడ్డి, కూల్ గ్యాట్ డాక్టర్ పి. కిరణ్ కుమార్, పిఆర్సి తమ్మెర విశ్వేశ్వరరావు,క్లబ్ సెక్రటరీ ముదుపు రవీందర్ రెడ్డి, క్లబ్ ట్రెజరర్ వజినపల్లి శ్రీనివాస్, క్లబ్ సభ్యులు చిదురాల శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నందన దేవి, డాక్టర్ మిరాజ్, డాక్టర్ ప్రియాంక, లయన్ సిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## యాచారం జడ్పీటీసీ బరిలో కొండాపురం శ్రీశైలం ?

- బరిలో నిలిచే వారిపై గ్రామాల్లో చర్చ
- యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న శ్రీశైలం

**ఇబ్రహీంపట్నం, విశాలభారతి:**



రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేయగానే అన్ని పార్టీలు అలర్ట్ అయ్యాయి. రిజర్వేషన్లు ఖరారు కాగానే పొలిటికల్ పార్టీలన్నీ ఒక్కసారిగా హీట్ పెంచాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీలకు ముందుగా ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార కాంగ్రెస్ పార్టీ సహా బీఆర్ఎస్, బీజేపీలు యాచారం జడ్పీటీసీ పీఠం కైవసం చేసుకోవాలని కన్నేశాయి. యాచారం మండలంలోని నందివనపర్తి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు , మండలంలోనే మేజర్ గ్రామ పంచాయతీకి బీఆర్ఎస్ పార్టీకి గ్రామ శాఖ అధ్యక్షుడు కొండాపురం శ్రీశైలం యాచారం జడ్పీటీసీ బరిలో ఉంటానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. యాచారం రిజర్వేషన్ బీసీ జనరల్ రావడంతో కొండాపురం శ్రీశైలం బీసీ సామాజిక వర్గం కుమ్మరి కులానికి చెందిన వ్యక్తి పట్టుదలని నమ్ముకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్తు రాజకీయాల్లో రాణిస్తున్నాడు. చదువులో ఎంతో చురుకుగా ఉన్న శ్రీశైలం డిగ్రీ పూర్తి చేసి , రియల్ ఎస్టేట్ రంగం వైపు వెళ్లాడు. తన స్వశక్తితో ఎదిగి తక్కువ సమయంలో రియల్ రంగంలో రాణించి తన మార్కును చూపించాడు. యాచారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో డైరెక్టర్ గా తన తల్లి కొండాపురం కలమ్మను బరిలో నిలిపి సహకార సంఘం డైరెక్టర్లలోనే అత్యధిక మెజారిటీతో విజయం సాధించాడు. అన్ని పార్టీల నాయకులు ఎవరికి వారే బలమైన అభ్యర్థిని బరిలోకి దింపాలని చూస్తున్న, ఆరునూరైనా.. ఏది ఏమైనా యాచారం జడ్పీటీసీ బరిలో తాను ఉంటానని శ్రీశైలం కుండలు బద్దలు కొట్టి చెబుతున్నాడు. బీఆర్ఎస్ పార్టీలో విధేయుడుగా ఉంటూ పార్టీ అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నానని తెలిపారు. యాచారం జెడ్పిటిసి కోసం పోటీ చేయడంలో తాను అర్హుడానని వెలిబుచ్చాడు.

## సుప్రీం కోర్ట్ తీర్పు శుభ పరిణామం

**తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ చామంతి నరేష్**

**తిరుమలగిరి,విశాలభారతి:**



42 శాతం బిసి రిజర్వేషన్లు ఆపాలని సుప్రీంకోర్టులో వేసిన కేసును కోర్టు కొట్టి వేయడాన్ని స్వాగతిస్తున్నామని తిరుమలగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ అన్నారు. సోమవారం మున్సిపల్ కేంద్రంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బిసి లకు రిజర్వేషన్లు ఇచ్చే విషయంలో అన్ని రకాలుగా పోరాటాలు చేసి సాధిస్తామని ఇప్పటికే ప్రభుత్వం 3 చట్టాలు, ఒక ఆర్డినెన్స్ ఒక జీవో ఇచ్చి బిసి రిజర్వేషన్లు అమలు చేసేందుకు కృషి చేసింది అని అన్నారు. ఏఐసీసీ అగ్ర నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ లు బిసి రిజర్వేషన్లు అమలు కోసం నిరంతరం కృషి చేస్తున్నారు.8 న హైకోర్టు లో కూడా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నాము అని అన్నారు. బిసిలకు రాజకీయంగా 42 శాతం రిజర్వేషన్లు అమలు కొరకు అన్ని వర్గాలు ప్రభుత్వానికి సహకరించాలనీ కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ల అమలు కోసం కృత నిశ్చయంతో ఉందని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేయించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందని అన్నారు. విద్యా ఉద్యోగ రాజకీయ రంగాలలో రిజర్వేషన్లతో పాటు వారికి రావలసిన కోట వారికి దక్కాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపారని అన్నారు.



## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే యశస్విని

**దేవరుప్పుల, విశాలభారతి:**

మండలం,చిన్నమదూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పరిదుల యాదయ్య సతీమణి పరిదుల అంజమ్మ ఇటీవల మరణించగా ఈరోజు పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి వారి ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న వేదన పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అదే గ్రామానికి చెందిన మడికొండ లచ్చమ్మ కూడా ఇటీవల మృతిచెందగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి వారి ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,యువజన నాయకులు,గ్రామపార్టీ నాయకులు,మహిళా నాయకురాళ్లు,కార్యకర్తలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## హుక్కా పార్లర్ పై పోలీసుల దాడులు

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

హుక్కా పార్లర్ పై పోలీసులు దాడి చేశారు. మైలార్దేవ్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాస్త్రీపురంలో పోలీసులు హుక్కా సెంటర్ పై దాడి చేశారు. అద్దె గదిలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న హుక్కా కేంద్రంపై రాజేంద్రనగర్ ఎస్ ఓ టి బృందం పోలీసులు రైడ్స్ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడితో పాటు 11 మంది యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 17 హుక్కా పాట్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## సీఎంని కలిసిన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగా రెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ని జూబ్లీహిల్స్‌లోని వారి నివాసంలో ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి కలుసుకున్నారు. ఈ సందర్బంగా సీఎం రేవంత్ రెడ్డి తో మల్ రెడ్డి రంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించినట్లు తెలిసింది.రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుకు కలిసి కృషి చేయాలని ఈ సందర్భంగా మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు.





## ఎమ్మెల్యే యశస్విని సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

**దేవరుప్పుల, విశాలభారతి:**

మండలకేంద్రంలో కాశవాడకు చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు 30 కుటుంబాలు దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్ ఆధ్వర్యంలో పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.పార్టీలో చేరిన కుటుంబాలకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటాలని,ప్రజల మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని,అభివృద్ధి, సంక్షేమం, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేసే పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ,ప్రజల ఆశయాలకు అనుగుణంగా పని చేసే నాయకత్వం కాంగ్రెస్‌దేనని,ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలితాలు అందుకోవాలంటే కార్యకర్తలు గ్రామస్థాయిలో మరింత చురుకుగా ఉండాలి అని అన్నారు.ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,మండల యువజన నాయకులు,మహిళా నాయకురాళ్లు,గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## హరీష్ రావుని మర్యాదపూర్వకంగా కలిసిన దండం రాంరెడ్డి

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

తెలంగాణ ట్రబుల్ షూటర్, మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావుని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు జగదీశ్ రెడ్డిని ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు దండెం రాంరెడ్డి వారి నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ విజయం సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలని నిర్ణయించుకున్నారు. అలాగే ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని స్థానిక సమస్యలు, ప్రజా సమస్యల పరిష్కారానికి తీసుకోవలసిన చర్యలు గురించి హరీష్‌రావు గారితో సవివరంగా చర్చించారు.ఈ సమావేశంలో నాయకులు పరస్పరం అభిప్రాయాలు పంచుకొని పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని సంకల్పించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నాయకులు పాల్గొన్నారు.





## మాజీ మంత్రిని కలిసిన పాల్వాయి స్రవంతి

**మునుగోడు, విశాలభారతి:**

దసరా పండుగను పురస్కరించుకుని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దసరా పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్వాయి వెంకట్ రెడ్డి శ్రవణ్ శ్యామ్ రమేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే



**కాప్రా, విశాలభారతి:**

మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ లోని పలు కాలనీలలో 52 లక్షల అంచనా వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరియు సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి.మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ లోని పలు కాలనీలలో 52 లక్షల అంచనా వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరియు సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి,స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని, ఉప్పల్ నియోజకవర్గం యొక్క అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తామని డివిజన్ అభివృద్ధి విషయంలో ఎల్లవేళలా సహకారం అందిస్తున్న ఎమ్మెల్యే కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ రూప, వర్క్ ఇన్స్పెక్టర్ చారి, నాయకులు వంజరి ప్రవీణ్ కరిపే, ఉల్లెం బాలరాజు, మల్లారెడ్డి, ఇక్బాల్, అరిఫుద్దీన్, వీరభద్ర రావు, మల్లేష్ గౌడ్, బోదాసు రవి, వెంకట్, మురళి, నరసింహ గౌడ్, కృష్ణ, చంద్రశేఖర్, రామకృష్ణ, చక్రవర్తి, దాసు, కిరణ్, శేఖర్ గౌడ్, శివ, దండెం నరేందర్, నిసార్ అహ్మద్ గోరి మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.పనుల వివరాలు డైమండ్ హిల్స్ చర్చ్ దగ్గర అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, వెంకటేశ్వరనగర్ మదర్ తెరిసా స్కూల్ ప్లే గ్రౌండ్ పక్కన, తిరుమలనగర్ దేవీ అపార్ట్మెంట్ ఎదురు రోడ్డు మరియు నరసింహ నగర్ షణ్ముఖ రెసిడెన్సి ఝాన్సీ స్కూల్ దగ్గర కాలనీలలో సీసీ రోడ్డు నిర్మాణం.



## మహబూబాబాద్‌లో ఎర్రమట్టి దోపిడీ

- **అధికారుల మౌనమే మాఫియాకు ధైర్యం**
- **మాఫియా ఎంత దౌర్జన్యంగా వ్యవహరిస్తుందో**
- **అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో**

**మహబూబాబాద్, విశాలభారతి:**

మహబూబాబాద్ పట్టణానికి కూతవేటు దూరంలోనే మున్సిపాలిటీ 6వ వార్డులో ఎర్రమట్టి మాఫియా ఆరాటం మితిమీరింది. బేతోలు గ్రామ పరిధిలోని వెంకటేశ్వర్ల బోర్డు సీలింగ్ భూమి (సర్వే నం.78)లో పచ్చని కొండను బుల్డోజర్లు, పెద్ద జెసిబీలు పిండిపారేస్తున్నాయి.పగలు,రాత్రి తేడా లేకుండా వందల టిప్పర్లు తిరుగుతున్నా అధికార యంత్రాంగం మూగబోయింది. ఈ మట్టిని ప్రతి ట్రాక్టర్‌కు రూ.5 నుండి రూ.10 వేలకే విక్రయించి మాఫియా రోజుకు లక్షలు దోచుకుంటోందని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు తమ కళ్లముందే జరుగుతున్న దోపిడీని నిర్లక్ష్యంగా చూస్తున్నారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే అధికార "పార్టీ వాళ్లతో మాట్లాడుకున్నాం" అంటూ బెదిరింపులు. ప్రజలు అడిగితే, రాజకీయ నాయకులు పెద్ద మనుషుల మాదిరి వ్యవహరిస్తున్నారు. ఈ దందాకు బిఆర్ఎస్ మాజీ నేతలు,కొంతమంది కాంగ్రెస్ స్థానిక నాయకులు అండగా ఉన్నారని సమాచారం. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్.కె మదార్ మాట్లాడుతూ.. గత ఆరు నెలలుగా బేతోలు గ్రామ సర్వే నెం.78 పరిధిలో జరుగుతున్న ఎర్రమట్టి తవ్వకాలను రెవెన్యూ, మైనింగ్ అధికారులు కళ్లెదుట చూస్తూ మౌనంగా ఉన్నారు. ఇది సహజ వనరుల దోపిడీ. వెంటనే నిందితులపై చర్యలు తీసుకోకపోతే జిల్లా స్థాయి ఆందోళన చేపడతాం" అని హెచ్చరించారు. అదేవిధంగా, "అధికార అండతోనే ఇంత పెద్ద దందా సాధ్యమవుతోంది. పచ్చని కొండలు కనుమరుగవుతున్నా ప్రభుత్వం కదలడం లేదు. ఎర్రమట్టి మాఫియా, అధికారుల కుమ్మక్కుతో జిల్లా అభివృద్ధి దెబ్బతింటోంది" అని మండిపడ్డారు. చర్యలు తీసుకోకుంటే ఆందోళన కార్యక్రమాన్ని పూనుకుంటామని హెచ్చరించారు.

## నీటి వనరుల పరిరక్షణ అందరి బాధ్యత

**మంచిర్యాల, విశాలభారతి:**

నీటి వనరుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జాతీయ జల మిషన్ డైరెక్టర్ అర్చన వర్మ అన్నారు. జాతీయస్థాయి 51వ వెబినార్ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జమ్మూ కాశ్మీర్ లోని రాజౌరి జిల్లా కలెక్టర్ అభిషేక్, మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ తో జలసంచాయి జన భగీదారి కార్యక్రమంలో నీటి వనరుల ఆవశ్యకత, పరిరక్షణ బాధ్యతలపై చేపట్టిన చర్యల వివరాలు సోమవారం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అర్చన మాట్లాడుతూ.. జల సంచాయి జన భగీదారి కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడిందని తెలిపారు. దేశ వ్యాప్తంగా వివిధ జిల్లాలలో విజయవంతంగా అమలు చేసిన నీటి సంరక్షణ కార్యక్రమాల ప్రదర్శన, ఇతర అంశాలతో జాతీయ జల శక్తి శాఖ ఆధ్వర్యంలో వెబినార్ నిర్వహించామన్నారు. జల సంరక్షణలో ప్రజలందరినీ భాగస్వామ్యులను చేసి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. జిల్లాలోని 18 మండలాలలో 16 గ్రామీణ, 2 పట్టణ ప్రాంతాల మండలాలు ఉన్నాయని, 82 శాతం గోండ్వానా శిలలు, 18 శాతం ఆర్కియన్ శిలలతో ఏర్పడి ఉందని తెలిపారు. గతేడాది జిల్లాలో 43,545 ఇంకుడుగుంతలు, 5,372 సామాజిక ఇంకుడుగుంతలు ఏర్పాటు చేశామన్నారు. నీటి కొరత ఉన్న ప్రాంతాలలో చెక్ డ్యాములు నిర్మించడం, చెట్లు నాటడం ద్వారా భూగర్భ నీటి స్థాయిని వృద్ధి చేశామని తెలిపారు. జిల్లాలో వరి, పత్తి పంట సాగు విస్తీర్ణం, దిగుబడి పెరిగిందని, భూగర్భ జల స్థాయితో పాటు నీటి నాణ్యత పెరిగిందని తెలిపారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల మహిళ గ్రూపుల ద్వారా సమావేశాలు నిర్వహించి భూగర్భ జల స్థాయి పెరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, విద్యాశాఖ సమగ్ర శిక్ష సమన్వయకర్తలు చౌదరి, సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఎస్పీలో భారీగా చేరికలు



**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇబ్రాం శేఖర్ ఆధ్వర్యంలో బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ)లో చేరికలు గణనీయంగా పెరిగాయి. సోమవారం రోజు ఆయన నివాసంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన వివిధ గ్రామాల నుండి పలువురు నాయకులు బీఎస్పీ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఇబ్రాం శేఖర్ మాట్లాడుతూ – "మహనీయుల ఆశయాల సాధన కోసం మన మధ్య ఉన్న కలహాలను పక్కన పెట్టి, మీతో పాటు మీ కుటుంబ సభ్యులు, బంధువులను కూడా బహుజన ఉద్యమంలోకి తీసుకురావాలి" అని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో ముకునూర్ గ్రామానికి చెందిన పెరిక అంజయ్య , పోల్కంపల్లి గ్రామానికి చెందిన పంది మహేందర్, పెద్ద అంబర్ పేట్ గ్రామానికి చెందిన పోలేపల్లి నవీన్ కుమార్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కార్యదర్శి గ్యార మల్లేష్ ,బీఎస్పీ నాయకులు యంజాల ప్రహ్లాద్ , చిత్రం కృష్ణ , పెద్ద ముత్తని గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## జోసెఫ్‌ను సత్కరించిన కాలనీ వాసులు

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

బెన్నీ జోసెఫ్ ఇటీవల విడుదలైన గ్రూప్ వన్ ఫలితాలలో తెలంగాణ రాష్ట్ర ఆడిట్ సర్వీసెస్ లో అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ గా ఎంపిక కావడం జరిగింది. ఈ విజయానికి తన స్వశక్తి కారణమని తన స్వయంకృషితో కష్టపడి చదివి ఈ ఉద్యోగం సాధించానని ఆయన గర్వంగా తెలిపారు ఇందుకుగాను రాజేంద్రనగర్ బండ్లగూడ జాగిర్ అభ్యుదయ కాలనీవాసులు బెన్నీ జోసెఫ్ ను శాలువాతో సత్కరించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బెన్నీ జోసెఫ్ మాట్లాడుతూ....తన లక్ష్యాన్ని సాధించడంలో తన కృషి, నిబద్ధత మరియు తన తల్లి దండ్రులు, కుటుంబం మరియు స్నేహితుల నుండి పొందిన ప్రేరణ పాత్రను కూడా ఆయన గుర్తించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు నరేందర్ నాగుల, ప్రముఖ సామాజిక వేత్త నరేందర్ బాబు, సుదర్శన్, థామస్, మార్క్, చంటి, రవిశంకర్ మరియు ఇతర వ్యక్తులు పాల్గొన్నారు.

## అగ్రి వర్సిటీలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

**రాజేంద్రనగర్, విశాలభారతి:**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 202526 విద్యా సంవత్సరానికి నిర్వహించనున్న పీజీ (రెగ్యులర్, ప్రత్యేక కోటా), పీ హెచ్ డీ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులు దాఖలు చేసుకునే గడువును పొడిగించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి. ఇ. సిచ్. విద్యాసాగర్ ప్రకటించారు. ఆసక్తి కల అభ్యర్థులు తమ దరఖాస్తు లని ఆన్ లైన్ లో ఈ నెల 12 వ తేదీ సాయంత్రం 5 గంటల వరకూ దాఖలు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 11 వ తేదీ వరకూ దరఖాస్తు రుసుము చెల్లించవచ్చని వివరించారు.అభ్యర్థుల వినతి మేరకు ఈ నెల 6 వ తేదీ వరకూ ఉన్న దరఖాస్తులు దాఖలు చేసుకునే గడువు ని ఈ నెల 12 వ తేదీ వరకూ పొడిగిస్తున్నట్లు రిజిస్ట్రార్ వివరించారు. కోర్సు లకు సంబంధించిన పూర్తి వివరాలు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ www.pjtau.edu.in లో అందుబాటులో ఉన్నాయని రిజిస్ట్రార్ డాక్టర్ . విద్యాసాగర్ పేర్కొన్నారు.






## బిఆర్ఎస్ స్థానిక ఎన్నికల ఘన సభ

**చిన్న గూడూరు, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు మండల కేంద్రంలో సోమవారం జరిగిన బిఆర్ఎస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల సమావేశంలో ప్రసంగిస్తున్న మన డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యా నాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మండల పార్టీ అధ్యక్షులు డి ఎస్ రాంసింగ్, ప్రధాన కార్యదర్శి కరే ధారాసింగ్, మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు మంగపతి రావు, మాజి కో ఆప్షన్ నెంబర్ ఎండి అయుబ్ పాషా, కేసముద్రం మార్కెట్ మాజీ డైరెక్టర్ బంటు ఉపేందర్, యువజన నాయకులు వల్లూరి చెన్నారెడ్డి, యూత్ అధ్యక్షుడు దుండి మురళి, చిన్న గూడూరు గ్రామ శాఖ అధ్యక్షులు గండి ఉప్పలయ్య, బిఆర్ఎస్ నాయకులు మల్లయ్య, మల్లేష్, కొమురెల్లి, హుస్సేన్, శ్రీను, మంగ్య, ముత్తయ్య, ప్రభాకర్, చిరంజీవి, యాకి, గంగరాజు, భాస్కర్, శ్రీనివాస్ రెడ్డి, సోషల్ మీడియా అధ్యక్షులు బాధావత్ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# సిఆర్టీలకు దసరా కానుకగా జీతాల విడుదల

- **ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం**
- **నాలుగు నెలల తర్వాత వేతనాలు ఖాతాల్లో జమ**
- **గిరిజన ఉపాధ్యాయుల ఆనందానికి అవధులు లేవు**



**మహబూబాబాద్, విశాలభారతి:**

జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోనీ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పని చేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు (సిఆర్టి ) 109 మందికి గత నాలుగు నెలల (జూన్, జూలై, ఆగస్ట్, సెప్టెంబర్ 2025 ) పెండింగ్ వేతనాలు చెల్లించినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేసిన కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు, ఈ సందర్భంగా ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల కాంట్రాక్టు ఉపాధ్యాయుల సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు & రాష్ట్ర కో ఆర్డినేటర్ దారావత్ బాలాజీ మాట్లాడుతూ.. గత అయిదు నెలలుగా వేతనాలు రాక చాలా ఇబ్బందులు పడ్డామని,సమయానికి దసరా పండుగ ముందు రోజే జీతాలు మా ఖాతాలలో జమ చేసినందుకు సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ జీతాల విడుదలకు అడ్డంకి గా ఉన్న కంటిన్యూషన్ ఫైల్ ను క్లియర్ చేయించి, జీతాలు వచ్చే విధంగా కృషి చేసిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్ కి, (సిఆర్టి) లకు అండగా ఉంటున్న పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కి, గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు. అలాగే అనునిత్యం సిఆర్టి ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ ఒక్కొక్కటి పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తున్న రాష్ట్ర అధ్యక్షులు మాలోత్ సోమేశ్వర్ కి మరియు లీగల్ అడ్వైసర్ రాంమోహన్ కి కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన విద్యార్థులు విద్యాభివృద్ధి కోసం అహర్నిశలు గా కృషి చేస్తున్న గిరిజన కాంట్రాక్టు ఉపాధ్యాయులకు సరియైన సమయంలో జీతాలు రాక పోవడంతో ఆర్థికంగా,మానసికంగా కృంగిపోతున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి శ్రీను, జిల్లా నాయకులు భుక్య భరత్, తేజావత్ హుస్సేన్, వెంకన్న, పొడుగు రవీందర్, విజయ్, హన్మంతు, పుష్ప, శరత్, విజయ్ భాస్కర్, కృష్ణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

## నాగపూర్‌హైదరాబాద్ హైస్పీడ్ రూట్‌పై సమీక్ష

**కరీంనగర్, విశాలభారతి:**

రాష్ట్ర రోడ్డు నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ నేతృత్వంలో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నాగపూర్ నుంచి హైదరాబాద్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైస్పీడ్ మార్గ అభివృద్ధికి సంబంధించిన వివరాల సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర, తెలంగాణ కలెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సమీక్షలో అసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లతో పాటు ఆర్డీవో మహేశ్వర్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా పరిధిలో గంగాధర, రామడుగు, కొత్తపల్లి మండలాల్లోని పలు గ్రామాల మీదుగా ఈ మార్గం అవుతుందని కలెక్టర్ పమేలా సత్పతి వివరించారు. ఆమె వివరించిన ప్రకారం, మార్గ నిర్మాణానికి సంబంధించిన భూసంబంధిత, పర్యావరణ, రవాణా సౌకర్యాల అంశాలను వివరాలలో విస్తృతంగా చేర్చబడినట్లు పేర్కొన్నారు.

## లే అవుట్ల కోసం ప్రత్యేక వెబ్ పోర్టల్ ఏర్పాటు చేయాలి

**ఇబ్రహీంపట్నం , విశాలభారతి:**

లే అవుట్లు, ప్లాట్లు రిజిస్ట్రేషన్ , రెవిన్యూ రిజిస్ట్రేషన్, శాఖల సమన్వయ లోపాలు భూ , ప్లాట్ల యజమానులు ఎదుర్కొంటున్న సమస్యల పరిస్కారం కోసం లే అవుట్ లకు ఒక ప్రత్యేకమైన వెబ్ పోర్టల్ ఏర్పాటు చెయ్యాలని తెలంగాణ రెవెన్యూ , గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని రాష్ట్ర సచివాలయంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ , ఉప్పరిగూడ మాజీ సర్పంచ్ బూడిద రామ్ రెడ్డి సోమవారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం బూడిద రామ్ రెడ్డి మాట్లాడుతూ.. లే అవుట్ ల విషయంలో వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందుకు లేకుండా ఉండే విధంగా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై మంత్రి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# తేజవత్ రవి సీతారాం కాంగ్రెస్‌లో చేరిక

**ఎమ్మెల్యే రామచంద్రనాయక్ సమక్షంలో**

**డోర్నకల్, విశాలభారతి:**

మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండల రాజకీయాల్లో కొత్త ఊపు తెచ్చే సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బిఆర్ఎస్ మండల యువనేత తేజవత్ రవి సీతారాం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమం డోర్నకల్ పట్టణంలో ఘనంగా జరిగింది. ఇందులో నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ పాల్గొని రవికి కండువా కప్పి పార్టీకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ, "ఇప్పటి నుండి నేను పూర్తిగా కాంగ్రెస్ సిద్ధాంతాలను పాటిస్తూ, పార్టీ ఏ కార్యక్రమం అప్పగించినా దాన్ని సమర్థంగా నిర్వర్తిస్తాను. నా ప్రాంతంలోని ప్రజల సమస్యలు పరిష్కారమవడం, గ్రామీణాభివృద్ధి సాధించడం నా ప్రధాన లక్ష్యం" అని అన్నారు. రవి చేరికతో మండల స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. గ్రామీణ ప్రజలతో సన్నిహిత సంబంధాలు కలిగిన రవి, ప్రజల కష్టాలు అర్థం చేసుకునే యువ నాయకుడిగా పేరుగాంచారు. ఆయన చేరికతో స్థానిక స్థాయిలో కాంగ్రెస్ బలపడుతుందని విశ్లేషిస్తున్నాయి. ఎమ్మెల్యే రామచంద్రనాయక్ మాట్లాడుతూ, "పార్టీలో చేరిన యువతే రేపటి నాయకత్వానికి ఆధారం. రవి వంటి నిబద్ధత కలిగిన యువ నేతలు పార్టీ పునాదులను మరింత బలపరుస్తారు" అని అన్నారు. ఈ చేరికతో డోర్నకల్ మండల రాజకీయాల్లో కాంగ్రెస్‌కు కొత్త ఊపిరి వచ్చింది అని అన్నారు.



# 2025లోనే హైయెస్ట్ గ్రాసింగ్ మూవీ..!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లేటెస్ట్ సెన్సేషనల్ మూవీ ఓజీ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి రెస్పాన్స్ అందుకుందో అందరికీ తెలిసిందే. పవర్ స్టార్‌ను ఎలాగైతే చూడాలని అభిమానులు కోరుకున్నారో అలాగే చూపెట్టాడు దర్శకుడు సుజీత్. ఇక ఓజీతో బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్ల సునామీ సృష్టించాడు పవన్ కళ్యాణ్. 11 రోజుల ముగిసే సరికి ఈ మూవీ వరల్డ్‌వైడ్‌గా ఏకంగా రూ.308 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు కలెక్ట్ చేసినట్లు మేకర్స్ తాజాగా వెల్లడించారు. దీంతో ఈ సినిమా రూ.300 కోట్ల క్లబ్‌లోకి అధికారికంగా ఎంట్రీ ఇచ్చింది. ఈ వసూళ్లతో 2025లోనే హైయెస్ట్ గ్రాసింగ్ తెలుగు సినిమాగా ఓజీ సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది. పవన్ పవర్‌ఫుల్ యాక్షన్‌కు థమన్ సాలిడ్ సంగీతం అండగా నిలిచింది. ఇమ్రాన్ హష్మి, ప్రియాంక మోహన్, శ్రియా రెడ్డి, ప్రకాష్ రాజ్, అర్జున్ దాస్ తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాను డివివి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై దానయ్య, కళ్యాణ్ దాసరి ప్రొడ్యూస్ చేశారు




# విజయ్ దేవరకొండ కారుకు ప్రమాదం

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ కారుకు ప్రమాదం జరిగింది. ఆయన ప్రయాణిస్తున్న కారు జోగులాంబ గద్వాల జిల్లా ఉండవల్లిలో ప్రమాదానికి గురైంది. ఆయన పుట్టపర్తి నుంచి హైదరాబాద్‌కు తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. నందికట్కూరు నుంచి పెబ్బేర్ వెళ్తున్న గొర్రెల లారీ అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో విజయ్ కారు ఎదురుగా వస్తున్న బొలెరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన కారు స్వల్పంగా దెబ్బతింది. అయితే, ఈ ప్రమాదంలో విజయ్ దేవరకొండకు ఎలాంటి గాయాలు కాలేదని తెలుస్తోంది. కారు ప్రమాదం అనంతరం విజయ్ దేవరకొండ తన స్నేహితుడి కారులో హైదరాబాద్‌కి తిరిగి ప్రయాణించారు. ఈ వార్తతో అభిమానులు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు.






# నాగార్జున 100వ సినిమాకి ఇంట్రెస్టింగ్ టైటిల్

నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు వారసుడిగా సినీ ఇండస్ట్రీలో అడుగుపెట్టి, తనదైన స్టైల్‌తో అక్కినేని వారసత్వాన్ని కొనసాగిస్తున్నాడు యువ సామ్రాట్ నాగార్జున. రొమాంటిక్ హీరోగా, యాక్షన్ స్టార్‌గా, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ హీరోగా అన్ని రకాల జానర్లలోనూ తన ప్రతిభను నిరూపించుకున్న నాగ్, ఇప్పుడు తన కెరీర్‌లో 100వ చిత్రం కోసం రెడీ అవుతున్నాడు.ఇటీవల 'కుబేర', 'కూలీ' చిత్రాల్లో నటించి నటన పరంగా మళ్లీ తన రేంజ్ చూపించిన నాగ్, ఈ మైలురాయి ప్రాజెక్టును ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్లాన్ చేస్తున్నాడు.తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రానికి కోలీవుడ్ దర్శకుడు రా కార్తీక్ దర్శకత్వం వహించనున్నాడు. మొదట దసరాకి షూటింగ్ ప్రారంభం అవుతుందని ప్రచారం జరిగినా, అది కుదరలేదు. కానీ, తాజా సమాచారం ప్రకారం అక్టోబర్‌లోనే పూజా కార్యక్రమాలతో షూటింగ్ ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సినిమాలో నాగార్జునతో పాటు ముగ్గురు హీరోయిన్లు నటించనున్నారని టాక్. రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండగా, ఈ ప్రాజెక్టును స్వయంగా నాగార్జున తన అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ కూడా హాట్ టాపిక్‌గా మారింది. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, 'లాటరీ కింగ్' అనే టైటిల్ పరిశీలిస్తున్నారట. నాగార్జునని అభిమానులు "కింగ్" అని పిలుస్తుంటారు కాబట్టి, ఈ టైటిల్ క్యాచీగా, అర్థవంతంగా ఉంటుందని టీమ్ భావిస్తోందట. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకునే ఈ సినిమాలో నాగచైతన్య, అఖిల్ కూడా కనిపించనున్నారని సమాచారం. వారు కీలక పాత్రల్లో నటిస్తారా, లేక ప్రత్యేక క్యామియోల్లోనే కన్పిస్తారా అన్నది మాత్రం క్లారిటీ రావాల్సి ఉంది. అక్కినేని ఫ్యాన్స్ మాత్రం ఈ అప్‌డేట్స్‌తో ఉత్సాహంగా ఉన్నారు. నాగ్ 100వ సినిమా అంటే అక్కినేని కుటుంబానికి, అభిమానులకు ప్రత్యేకమైన మైలురాయి. అందుకే, వీలైనంత త్వరగా షూటింగ్ ప్రారంభించి, ఫస్ట్ లుక్ పోస్టర్లు, గ్లింప్స్ రిలీజ్ చేయాలని ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు.

# బ్లాక్ డ్రెస్సులో జాన్వీ గ్లామర్ షో

జాన్వీ కపూర్ తన ఫ్యాషన్ లుక్స్‌తో స్టన్ చేస్తోంది. జాన్ గల్లియానో బ్లాక్ కలర్ డ్రెస్సులో జిగేల్మంది ఆ బ్యూటీ. 1986 ఫాలన్ ఏంజిల్స్ కలెక్షన్‌కు చెందిన డ్రెస్సింగ్‌ను జాన్వీ ధరించింది. ఫ్రాన్స్ ఉద్యమ కాలంతో 1986 కలెక్షన్‌కు లింకు ఉన్నది. ప్రాచీన గ్రీకు, రోమన్స్‌కు చెందిన సాధారణ స్టయిల్‌లో డ్రెస్సు ఉంటుంది. గల్లియానో డిజైన్‌లో చాలా లైటర్ ఫ్యాబ్రిక్స్ ఉంటాయి. బ్లాక్ చార్‌కోల్ షేడ్‌లో ఉన్న సీజర్ ప్లీట్ డ్రెస్సును జాన్వీ వేసుకున్నది. ఆ ఔట్‌ఫిట్‌కు స్కాలోప్ నెక్‌లైన్ ఉంది. లాంగ్ స్లీవ్స్, కర్వ్ పౌచ్ ప్యాకెట్లు కూడా ఉన్నాయి. ఇక షర్ట్‌కు కూడా క్రాసోవర్ సీజర్ కట్టింగ్‌తో డిజైన్ ఉంది. రియా కపూర్ ఈ డ్రెస్సును స్టయిల్ చేసింది. ఈ ఔట్‌ఫిట్‌కు తగినట్లు హై హీల్స్ వేసుకుంది జాన్వీ. క్లచ్ అండ్ డార్క్ సన్‌గ్లాసెస్ కూడా పెట్టుకుంది ఆ క్యూటీ.



# మూడేళ్ల తర్వాత.. నెట్‌ఫ్లిక్స్‌లో రిషబ్ శెట్టి కాంతార ట్రెండింగ్

కన్నడ యాక్టర్ రిషబ్ శెట్టి లీడ్ రోల్‌లో తెరకెక్కి తెలుగు, తమిళం, హిందీ, మలయాళ భాషల్లో బాక్సాఫీస్‌ను షేక్ చేయడమే కాకుండా గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద తన సత్తా ఏంటో చూపించిన చిత్రం కాంతార. ఈ సినిమాతో హీరో కమ్ డైరెక్టర్‌గా పాన్ ఇండియా ఇమేజ్ సంపాదించుకున్నాడు రిషబ్ శెట్టి. ఇప్పుడు మరోసారి ప్రీక్వెల్ కాంతార చాప్టర్-1తో హాట్ టాపిక్‌గా నిలుస్తున్నాడు. కాంతార చాప్టర్-1 కూడా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. విడుదలైన అన్ని భాషల్లో మంచి వసూళ్లు రాబడుతూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో మూడేళ్ల కింద విడుదలైన కాంతార డిజిటల్ ప్లాట్‌ఫాంలో ట్రెండింగ్‌లో నిలుస్తోంది. ఇండియాలో నెట్‌ఫ్లిక్స్ లో కాంతార హిందీ వెర్షన్ 4వ స్థానంలో ట్రెండింగ్ అవుతుంది. కాంతార చాప్టర్ 1 విడుదలైన రోజునుంచి బాక్సాఫీస్ వద్ద చూపిస్తున్న పర్‌ఫార్మెన్స్ వల్లే కాంతార ట్రెండింగ్‌లో నిలుస్తుండటం విశేషం. కాంతార చాప్టర్ 1 వరల్డ్ వైడ్‌గా ఇప్పటివరకు రూ.250 కోట్లు గ్రాస్ రాబట్టింది. పాపులర్ డిజిటల్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైమ్ వీడియో కాంతార చాప్టర్ 1 డిజిటల్ రైట్స్ భారీ మొత్తానికి దక్కించుకుంది. అక్టోబర్ 2న దసరా పండుగ సందర్భంగా విడుదలైన 'కాంతార చాప్టర్ 1' బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాస్తోంది. ప్రపంచవ్యాప్తంగా సంచలన విజయం సాధిస్తూ విడుదలైన నాలుగు రోజుల్లోనే రూ. 300 కోట్ల క్లబ్‌లోకి చేరింది. హోంబలే ఫిలింస్ నిర్మాణంలో రూపొందిన ఈ మూవీ 7 భాషల్లో, దాదాపు 7000 థియేటర్లలో విడుదలైంది. ఈ సినిమా మొదటి మూడు రోజుల్లోనే రూ. 235 కోట్లు వసూళ్లతో దూసుకెళ్తోంది





# రాజాసాబ్ ట్రైలర్‌కు మాసివ్ రెస్పాన్స్..!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న కామెడీ హర్రర్ ఎంటర్‌టైనర్ 'ది రాజా సాబ్' సంక్రాంతి కానుకగా 2026 జనవరి 9న విడుదల కానుంది. ఈ సినిమా నుంచి ఇటీవల ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. ఇక ఈ ట్రైలర్‌కు ఇప్పటికే 40 మిలియన్ల వ్యూస్ సాధించింది. దీంతో ఈ ట్రైలర్ ప్రేక్షకుల్లో హైప్ పెంచింది. మాళవిక మోహనన్, రిద్ధి కుమార్, నిధి అగర్వాల్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాలో సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపిస్తారు. కాగా చితర యూనిట్ ప్రస్తుతం యూరప్‌లో పాటల చిత్రీకరణ కోసం లొకేషన్స్ వేటలో ఉన్నారు. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందించగా, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.